క్లుప్తంగా

## పుస్తక పఠనం అలవర్చుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఠాగూర్ గ్రంథాలయ అధికారి కె. రమాదేవి అన్నారు. ఆదివారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా దేశ నాయకులు, చరిత్ర, కథలు, కార్టూన్లు, పురాణాలు, సైన్స్ వంటి వివిధ రకాల పుస్తకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ పౌర గ్రంథాలయం వారి ఆదేశాల మేరకు ప్రతినెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుస్తక పఠనం ద్వారా మేధస్సు పెరుగుతుందని, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడతాయన్నారు. మానసిక వికాసానికి పుస్తక పఠనం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు

డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్




మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా వైద్యుల విభాగం చైర్మన్ డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని ప్రైవేటీకరించే పనిలో నిమగ్నమై ఉండగా.. బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా పొరుగు రాష్ట్రం చైనాలో ఇటీవల హెచ్ఎంపీవీ వ్యాప్తికి సంబంధించిన భయాన్ని గుర్తించి పత్రికా ప్రకటనను విడుదల చేసిందన్నారు. కానీ ఏపీ ప్రభుత్వం ఎటువంటి ప్రకటన గాని, సమాచారాన్ని కానీ ప్రజల ముందు పెట్టే ప్రయత్నం చేయలేదని విచారం వ్యక్తం చేశారు. ఇది ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజారోగ్యం పరిరక్షణకు కృషి చేయాలని ఆయన కోరారు.

## ముగిసిన అపమృత్యుంజయ సహిత ఆయుష హోమం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శ్రీ శివకేశవ దేవాలయంలో లోక కల్యాణార్థం గత మూడు రోజులుగా జరుగుతున్న అపమృత్యుంజయ సహిత ఆయుష హోమం ఆదివారం ముగిసింది. ఆలయ అర్చకుడు వరదరాజులు మృత్యుంజయ మూలమంత్ర, మూలమూర్తి హోమం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ చేశారు. అనంతరం శ్రీ దేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు స్వామిశరణ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామివారి మందిరంలో ఆదివారం శ్రీ మణికంఠ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది స్వాములకు ఇరుముడి కట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

## దుర్గమ్మకు నృత్య నీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలువురు కళాకారిణులు నృత్య నీరాజనాలను అర్పించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీతాండవ నృత్య, డ్యాన్స్, మ్యూజిక్ అకాడమీకి చెందిన జానకి మోహన్‌రావు, విజయ్‌ల పర్యవేక్షణలో 14 మంది కళాకారిణులు తమ నాట్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై నయన శిఖర, అన్నపూర్ణ, పూజిత, దీక్షిత, సిరి లిఖిత, సిద్ధిక్ష, నిక్షిత, జాశ్రీత, శ్రీశాన్విలతో పాటు మరి కొంత మంది పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# కనీస సౌకర్యాలు కరువు

- సమస్యల వలయంలో మధురానగర్ రైల్వేస్టేషన్
- కానరాని రైళ్ల రాకపోకల వివరాల బోర్డు
- పట్టించుకోని రైల్వే అధికారులు




మధురానగర్ రైల్వేస్టేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని మధురానగర్ రైల్వేస్టేషన్ అసౌకర్యాలకు నిలయంగా మారింది. నిత్యం రద్దీగా వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రైల్వేస్టేషన్‌లో కనీసం రైళ్ల రాకపోకల వివరాలు తెలియజేసే బోర్డు కూడా లేదు. రైలు రాకపోకల వివరాలు తెలియజేసే వివరాలను చిన్న తెల్ల పేపర్‌పై ప్రింట్ తీసి అతికించి చేతులు దులుపుకొన్నారు. చిన్నపాటి అక్షరాలు వృద్ధులకు కనిపించక అవస్థలు పడుతున్నారు. అలాగే ప్లాట్‌ఫాం బీటలు వారడంతో రైలు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల వాటర్ ట్యాప్‌లు లేకపోవడంతో పాటు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో నాచు పట్టి అపరిశుభ్రంగా మారాయి. అలాగే ఇక్కడ పడిపోయిన గోడను సైతం నిర్మించకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది.

### భద్రత కరువు

ఇక్కడ టాయిలెట్లకు తాళాలు వేస్తున్నారని దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. టాయిలెట్ల వద్ద సిబ్బంది లేకపోవడంతో ఎవరిని అడగాలో తెలియడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. అలాగే విశాలంగా ఉన్న రైల్వేస్టేషన్ వద్ద రైల్వే పోలీసులు లేకపోవడంతో భద్రత కరువైంది. ఇక్కడ ఆకతాయిలు, గంజాయి బ్యాచ్ చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. చీకటిపడితే ప్రయాణికులు బిక్కు బిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ రైల్వే పోలీసులను ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

### రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించాలి

నగరంలో ఉన్న మధురానగర్ రైల్వేస్టేషన్ సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించి కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వడం ద్వారా మెయిన్ స్టేషన్‌పై కొంత భారం తగ్గే అవకాశం ఉంది.



కూలిన గోడకు మరమ్మతులు చేయని దృశ్యం



టాయిలెట్‌కు తాళం



టికెట్ కౌంటర్ వద్ద రైళ్ల సమాచారాన్ని పేపర్‌పై ప్రింట్ తీసి అతికించిన దృశ్యం

### పనిచేయని అనౌన్స్‌మెంట్

మధురానగర్ రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు తెలియజేసే అనౌన్స్‌మెంట్ పనిచేయక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైలు వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు అనౌన్స్‌మెంట్ చేయకపోవడంతో ప్రయాణాలు చేసే వారు నానాయాతన పడుతున్నారు. అనౌన్స్ లేకపోవడం వల్ల ఎప్పుడు రైలు వస్తుందో ఎలా వెళుతుందో తెలియడం లేదని వాపోతున్నారు. రైలు సమాచారం అడిగితే సిబ్బంది విసుక్కుంటున్నారని.. సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రైళ్ల సమాచారం బోర్డు లేదు



ఇక్కడ ఏ రైలు ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. కనీసం అనౌన్స్‌మెంట్ కూడా చేయడం లేదు. రైలు ఎప్పుడు వస్తుందని అడిగితే వచ్చినప్పుడు వెళ్లి ఎక్కు అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. అలాగే ఇక్కడ రైళ్ల రాకపోకల వివరాలు తెలియజేసే బోర్డు లేదు. కేవలం ఒక పేపర్‌పై ప్రింట్ తీసి అంటించారు.

–ఎం శివ, ప్రయాణికుడు

### రైల్వే అధికారుల నిర్లక్ష్యం



శాటిలైట్ స్టేషన్‌గా మధురానగర్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి. రాత్రిపూట ఇక్కడ రైలు దిగాలంటేనే భయం వేస్తుంది. కనీసం రైల్వే పోలీసులను ఏర్పాటు చేసినా బాగుంటుంది. ఇక్కడ అనౌన్స్‌మెంట్ పనిచేయడం లేదు. ఇది అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది.

–మల్లంపల్లి రామకోటేశ్వరరావు, ప్రయాణికుడు

## పద్యనాటక వైభవాన్ని చాటిన ప్రదర్శనలు



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి, శ్రీనివాస నాట్యమండలి యూనిట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న పద్యనాటికలు ఆదివారం ముగిశాయి. కలియుగ నాథుడు శ్రీనివాసుని లీలలు వర్ణిస్తూ కలియుగ వైకుంఠం నాటకం, తిరుపతి వెంకట కవులు రచించిన పాండవ ఉద్యోగ విజయాల్లోని పడక సీను, చిలకమర్తి లక్ష్మీనరసింహపంతులు రచించిన గయోపాఖ్యానంలోని సన్నివేశాలను ప్రదర్శించారు. దత్తుబాబు, ప్రసాద్‌బాబు, బుజ్జి సాహెబ్, సోని, ఆంజనేయులు, దాసుబాబు, గాబ్రియేలు నటించారు. నటీ నటులను నిర్వాహకులు సత్కరించారు.

## చిన్నారులకు స్వెట్టర్ల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డు హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం నిరుపేద, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు ఎస్‌కే షఫీవుల్లా, కోరంగి నాగ మల్లేశ్వరి మాట్లాడుతూ చలి పెరుగుతున్న దృష్ట్యా హెచ్ఐవీ బాధిత, నిరుపేద చిన్నారులకు సామాజిక బాధ్యతగా దాత ఫణి ప్రసాద్ సహకారంతో స్వెట్టర్లు అందజేస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హేమంతరావు, ఆఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

# బహుముఖ ప్రతిభాశాలి మల్లిక్

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి మల్లిక్(మోదిని మల్లికార్జునరావు) విశ్వమాత ఛారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి సహకారంతో శ్రీ సరస్వతి కళాపీఠం ఆరో వార్షికోత్సవం, చిత్రకారుడు, గాయకుడు మోదిని మల్లికార్జునరావుకు శ్రావ్యగాన చిత్రకళా సరస్వతి బిరుదు ప్రదానం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ మాట్లాడుతూ మల్లిక్ చిత్ర కళలోనూ, సంగీత కార్యక్రమంలో విశేష ప్రతిభ చూపుతున్నట్లు తెలిపారు. సరస్వతి కళాపీఠం వ్యవస్థాపకురాలు రోజా ప్రసన్న మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, పరుచూరి విజయలక్ష్మి, డేవిడ్‌రాజు, వడ్డాది కామేశ్వరి, రామకృష్ణ, శ్రీనివాసరావు, శ్రీధర్ బాంధవి, భావన్నారయణ, రత్నకుమారి పాల్గొన్నారు. మల్లిక్‌కు శ్రావ్యగాన కళా సరస్వతి బిరుదు ప్రదానం చేశారు. గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. రోజా వేణుగోపాల్ నిర్వహించారు. అతిథులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



మల్లిక్‌కు శ్రావ్యచిత్రకళా సరస్వతి బిరుదు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

## ముగిసిన ప్రవచనాలు



విజయవాడ కల్చరల్: రుషిపీఠం విజయవాడ, భారతీయ సనాతన వేదిక ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య కళాశాలలో తొమ్మిది రోజులుగా మన కోసం మన పురాణాలు అంశంగా నిర్వహిస్తున్న ప్రవచనాలు ఆదివారం ముగిసాయి. సామవేదం షణ్ముఖశర్మ మాట్లాడుతూ పురాణాలు నేటి కాలానికి అందనప్పటికీ అవి నిత్యనూతనాలు అని వివరించారు. మన పురాణాలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయన్నారు. ఆగమ శాస్త్రంలోని అనేక అంశాలు మన పురాణాల్లో కనిపిస్తాయన్నారు. వాస్తు విజ్ఞానం గురించిన అనేక అంశాలను వివరించారు. వివిధ పురాణాల్లో పరమేశ్వరుని రూపాలు, నామాలు వివరిస్తూ ఈశ్వర శక్తి ఏవిధంగా ఉంటుందో తెలిపారు. సాహితీవేత్త కప్పగంతు రామకృష్ణ నిర్వహించారు. పాటిబండ సుందరరావు, ఆలమూరి శ్రీనివాస్, తొండెపు రత్నశ్రీనివాస్‌లు సామవేదాన్ని ఘనంగా సత్కరించారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఏసీపీ స్రవంతి రాయ్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తతో ఉండాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నార్త్ డివిజన్ ఏసీపీ స్రవంతి రాయ్ హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. షీటర్లపై పోలీసుల నితరంతర నిఘా ఉంటుందని, వారు మంచి నడవడితో కుంటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలన్నారు. ఏదైనా చట్టవ్యతిరేక చర్యలకు ప్పాడితే ఎట్టిపరిస్థితిలో ఉపేక్షించేది లేదని ఏసీపీ హెచ్చరించారు.



రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏసీపీ స్రవంతి రాయ్

# కనుల పండువగా ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో లోక కల్యాణార్థం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. సాయిబాబా మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11వ తేదీ శనివారం విశేషంగా 1008 లఘు గంగాళములతో పాయస నివేదన (కూడారై), 13న శ్రీ గోదా రంగనాథ స్వామివార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ధనుర్మాసోత్సవాల్లో పాల్గొని శ్రీ గోదా రంగనాథస్వామి వార్లను దర్శించుకుని వారి కృపకు పాత్రులు కావాలని సూచించారు. శ్రీ గోదా రంగనాథస్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఆకాంక్షించారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి వ్యవస్థాపక కన్వీనర్ ఎం. సత్యశ్రీహరి, పారాయణ మండలి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

# సందడిగా పుస్తక మహోత్సవ ప్రాంగణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి, స్టాల్స్‌ను తిలకించారు. సమాజ అభ్యుదయానికి కావాల్సిన అన్ని రకాల సాహిత్యాన్నీ ప్రజలకు అందించేందుకు విశాలాంధ్ర విజ్ఞాన సమితి కృషి చేస్తోందని ఆ సంస్థ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో విశాలాంధ్ర విజ్ఞానసమితి ప్రచురించిన నాలుగు పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. గడ్డం కోటేశ్వరరావు మాట్లాడుతూ.. వివిధ భారతీయ భాషలూ, ప్రపంచ భాషల నుంచి కూడా అభ్యుదయ సాహిత్యాన్ని తెలుగులోకి మార్చి అందించేందుకు తాము ప్రయత్నిస్తామన్నారు. ఈ సభలో కోబడ్ గాంధీ రచించిన 'బీటలువారిన స్వేచ్ఛ'ను నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు సి.నరసింహారావు ఆవిష్కరించారు. డాక్టర్ మహీధర్ నళినీ మోహన్ రచించిన 'నక్షత్ర వీధుల్లో భారతీయుల పాత్ర'ను సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యదేవర కల్పన ఆవిష్కరించారు.

పుస్తకాన్ని తుమ్మల శ్రీ కుమార్ సభకు పరిచయం చేశారు. డాక్టర్ గార్గి చక్రవర్తి. సుప్రియా చోటాని రచించిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తొలి రోజుల చరిత్ర పుస్తకాన్ని అఖిల భారత మహిళా సమాఖ్య ఉపాధ్యక్షురాలు డాక్టర్ కూనంనేని రజని ఆవిష్కరించారు. పరుచూరి జమున పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. పెన్మత్స దుర్గాభవాని, అక్కినేని వనజలు తొలి ప్రతులను స్వీకరించారు. వివిన మూర్తి రచించిన వాడూ–నేనూ పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ హరనాథరెడ్డి తదితరులు ఆవిష్కరించారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు



స్టాల్స్‌లో పుస్తకాలను తిలకిస్తున్న పుస్తక ప్రియులు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

### పిడికిటి రామకోటేశ్వరరావు సంస్మరణ సభ

పుస్తక మహోత్సవ సంఘం సంస్థాపక కోశాధికారి పిడికిడి రామకోటేశ్వరరావు సంస్మరణ సభ ఆదివారం విజయవాడ పుస్తక మహోత్సవం ప్రాంగణంలో నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పుస్తక ప్రచురణను ఒక సామాజిక బాధ్యతగా భావించి, చివరి వరకూ అలాగే నిర్వహించిన ఆదర్శవంతుడు పిడికిటి రామకోటేశ్వరరావు అన్నారు. 'పిడికిటి రామకోటేశ్వరరావు జ్ఞాపకాలు' పుస్తకాన్ని అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ తెలుగువారు జాతీయస్థాయిలో రాణించడానికి హిందీ భాషతో బలమైన అనుబంధం ఉండటమే కారణమన్నారు. ఆ అనుబంధం బలపడటానికి కృషిచేసిన వారిలో కోటేశ్వరరావు ఒకరన్నారు. పుస్తకం మొదటి ప్రతిని తానా పత్రిక సంపాదకులు కేసీ చేకూరి స్వీకరించారు. సభకు గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ అధ్యక్షత వహించారు. పుస్తక మహోత్సవ సంఘం పూర్వాధ్యక్షుడు డి.అశోక్ కుమార్, తానా పూర్వాధ్యక్షుడు కోమటి జయరాం, సతీష్ వేమన, రామచంద్ర మిషన్ ప్రతినిధి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటించడం క్షేమం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ట్రాఫిక్ రూల్స్ పాటించడం అందరికీ క్షేమమని విజయవాడ పోలీస్ కమిషనరేట్ డీసీపీ(ట్రాఫిక్) కృష్ణమూర్తి నాయుడు పేర్కొన్నారు. నగరంలోని బందరురోడ్డులో జరుగుతున్న 35వ పుస్తక మహోత్సవ ప్రాంగణం దగ్గర కానూరులోని స్కాట్ స్ప్రైన్ అంతర్జాతీయ పాఠశాల, విజయవాడ సిటీ పోలీస్ కమిషనరేట్, రాయల్ ఎన్‌ఫీల్డ్ సంయుక్తంగా రోడ్డు భద్రతపై వినూత్న అవగాహనా కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ.. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు సురక్షితంగా బయటపడవచ్చునని చెప్పారు.

### ఆకట్టుకున్న నాటక ప్రదర్శన..

ట్రాఫిక్ విభాగం అడిషనల్ డీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిల్లలు చెప్పాలని సూచించారు. స్కాట్ స్ప్రైన్ అంతర్జాతీయ పాఠశాల, రవీంద్ర భారతి స్కూల్స్ చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, వైస్ ప్రిన్సిపాల్స్‌తో పాటుగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ విద్యార్థులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనల పాటించాలంటూ నృత్యాలు చేస్తూ తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

# ముందే వచ్చిన సంక్రాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిత్యం రోగులకు సేవలు అందించడంలో బిజీగా ఉండే వైద్యులు ఆదివారం సాయంత్రం ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. మన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అందులో భాగంగా రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, కోడి పుంజులు, చెరుకు గడలు, భోగి మంటలు ఏర్పాటు చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వైద్యులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం సాంప్రదాయ వంటకాలతో విందు భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు బోడేపూడి హనుమయ్య, కార్యదర్శి డాక్టర్ వుమ్మినేని సురేష్, కోశాధికారి డాక్టర్ ఎంపీ సుబ్బారావులతో పాటు, వైద్యులు ఎం.రవీంద్రనాథ్, పరుచూరి అనీల్‌కుమార్, రాంప్రసాద్, మెహబూబ్ షేక్, మనోజ్‌కుమార్, ఎంఏ రెహమాన్‌లతో పాటు నగరానికి చెందిన 500ల మందికిపైగా వైద్యులు పాల్గొన్నారు.



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న వైద్యులు

### సిద్ధార్థ మహిళా కళాశాలలో..

మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగిమంటలు, రంగ వల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, బొమ్మల కొలువు, హరిదాసుల కీర్తనలు వంటి వాటితో వేడుకలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగాయి. కళాశాల ప్రాంగణమంతా గ్రామీణ వాతావరణాన్ని తలపించింది.



సిద్ధార్థ మహిళా కళాశాలలో ముగ్గులు వేస్తున్న మహిళలు